క్లుప్తంగా

నేడు లక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణం

పెనుగంచిప్రోలు: గ్రామంలో ఉన్న శ్రీతిరుపతమ్మ వారి దత్తత ఆలయమైన శ్రీధర్మపురి లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో బుధవారం రాత్రి 7.30 గంటలకు స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో కె.రమేష్‌నాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా ఉదయం 7.30 గంటలకు పంచామృత నవ కలశ అభిషేకం, పెండ్లి కుమారుడిని చేస్తారన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు.

లక్ష్మీనృసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

నందిగామ: నందిగామ శివారు పల్లగిరి గుట్టపై ఉన్న రాజ్యలక్ష్మీసమేత లక్ష్మీనృసింహస్వామి వారి 32 వ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే మహోత్సవాల్లో భాగంగా మొదటిరోజు స్వామి వారికి పలు రకాల విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం చందనంతో స్వామి వారిని అలంకరించి తులసీ దళార్చన నిర్వహించారు. మహోత్సవాలను పురస్కరించుకుని పలు రకాల హోమాది కార్యక్రమాలు నిర్వహించారు.

దుర్గమ్మ సన్నిధిలో రాహుకేతు పూజలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో రాహుకాల సమయంలో నిర్వహించిన రాహుకేతు పూజలకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని పాత అన్నదాన భవనంలో రాహుకేతువులకు ఆలయ అర్చకులు పూజలు చేశారు. అనంతరం అమ్మవారి దర్శనానికి ఉభయదాతలను అనుమతించారు. మరో వైపున రాహుకాలంలో అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయడానికి మహిళలు విశేషంగా తరలివచ్చారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని నటరాజస్వామి ఆలయం, సుబ్రహ్మణ్యస్వామి ఆలయం పరిసరాలలో మహిళలు రాహుకాల పూజలు చేశారు.

కమనీయం.. వేంకటేశ్వర కల్యాణం



మధురానగర్(విజయవాడసెంట్రల్): రామకృష్ణాపురం శ్రీ అలివేలు మంగ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో మంగళవారం వార్షిక బ్రహోత్సవాల్లో భాగంగా స్వామివారి కల్యాణం కనులపండువగా జరిగింది. ఆలయ అర్చకులు అలివేలు మంగ పద్మావతి శ్రీ వేంకటేశ్వరస్వామి వార్లకు ప్రత్యేక పూజలు అర్చనలు చేశారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ స్వామివారి కల్యాణం సంప్రదాయబద్ధంగా జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

ఆటో టైర్లు, బ్యాటరీ చోరీ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పార్కింగ్ చేసిన ఆటో టైర్లు, బ్యాటరీ చోరీ చేసిన ఘటన కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కలరా హాస్పటల్ ప్రాంతానికి చెందిన సోమి సత్యనారాయణ ఆటోనడుపుతుంటాడు. సత్యనారాయణ తన ఆటోను కేఎల్‌రావు స్విమ్మింగ్ పూల్ వద్ద పార్కింగ్ చేస్తుంటాడు. ఈ నెల 17వ తేదీ రాత్రి ఆటోను స్విమ్మింగ్ పూల్ వద్ద నిలిపి ఇంటికి వెళ్లాడు. మరుసటి రోజు ఉదయం వెళ్లి చేసే సరికి ఆటో రెండు టైర్లు, బ్యాటరీతో పాటు సామగ్రిని ఎవరో గుర్తు తెలియని వారు ఎత్తికెళ్లిపోయారు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కొల్లి నాగేశ్వరరావుకు నివాళి

తిరువూరు: రైతాంగ సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు నిర్వహించిన కొల్లి నాగేశ్వరరావు చిరస్మరణీయుడని సీపీఐ జిల్లా సమితి మాజీ కార్యదర్శి తూము కృష్ణయ్య అన్నారు. స్థానిక సుంకర వీరభద్రరావు భవన్‌లో కొల్లి వర్ధంతిని మంగళవారం జరిపారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన నాయకులు కమ్యూనిస్టు ఉద్యమాలు, రైతాంగ పోరాటాల్లో కొల్లి పాత్రను వివరించారు. నాయకులు మాలపాటి ఉదయ్, నాగులుమీరా, చిలుకూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మునునూరు: భూ పోరాటాల వీరుడిగా జాతీయ ఖ్యాతినార్జించిన కొల్లి పోరాట పంథా నేటి యువతకు ఆదర్శమని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాయంకుల లక్ష్మణరావు అన్నారు. సీపీఐ జాతీయ మాజీ కార్యదర్శి, భూపోరాటాలకు మార్గదర్శి దివంగత కొల్లి నాగేశ్వరరావు నాలుగో వర్ధంతిని ఆయన స్వగ్రామం గుడిపాడులో పార్టీ నియోజకవర్గ కార్యదర్శి బత్తుల వెంకటేశ్వరరావు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ముందుగా గ్రంథాలయం వద్ద పార్టీ పతాకాన్ని ఎగురవేసి, కొల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వేసవి శిబిరాల్లో విద్యార్థుల సృజనాత్మకత



కంచికచర్ల గ్రంథాలయంలో నృత్యంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు



పేట గ్రంథాలయంలో విద్యార్థులకు చదరంగంలో శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయులు

కంచికచర్ల: విజ్ఞానం, వినోదంతో పాటు ఆరోగ్యాన్ని పెంచే విజ్ఞాన భాండాగారాలు గ్రంథాలయాలని, విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని గ్రంథపాలకుడు అల్లూరు రామచంద్రుడు తెలిపారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపులో భాగంగా రాష్ట్ర పౌర గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఎండలో తిరగకుండా వేసవి సెలవుల్లో వారికి వినోదం, విజ్ఞానం అందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడుతున్నాయన్నారు. వేసవి సెలవులను విద్యార్థులు వృథా చేసుకోకుండా వారిలో దాగిఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు పలు విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. దేశ నాయకులు, స్వాతంత్ర్య సమరయోధుల గురించి తెలుసుకునేందుకు పుస్తకాలు చదివిస్తున్నామన్నారు. వేసవి విజ్ఞాన శిబిరాలకు విద్యార్థులను పంపించేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చొరవ చూపాలన్నారు. అనంతరం విద్యార్థులకు చెస్, డ్రాయింగ్, యోగా, డ్యాన్స్ నేర్పించారు. కార్యక్రమంలో డాన్స్ మాస్టర్ నవీన్ నాని యోగా గురువు ఎం.మల్లికార్జునరావు, డ్రాయింగ్ మాస్టర్ నీలం సర్వేశ్వరరావు, ఐఈఆర్టీ ఉపాధ్యాయుడు ఎం.కనకారావు పాల్గొన్నారు.

గాలివాన సమయాల్లో అప్రమత్తం

- చెట్ల కింద తల దాచుకోకపోవటం ఉత్తమం
- ఎలక్ట్రానిక్ వస్తువులు వాడకపోవటం శ్రేయస్కరం



కంచికచర్ల నేషనల్ హైవేపై వర్షానికి పడిపోయిన చెట్టు

కంచికచర్ల: గాలి వాన సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వీలైనంత వరకు బయటకు రాకపోవటం మంచిదని వాతావరణ శాఖ నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా వ్యవసాయ పనులకు వెళ్లే కూలీలు, రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుందని, వర్షం కురిసే సమయంలో పిడుగులు పడే అవకాశం ఉంటుందని, చెట్ల కింద తలదాచుకోవటం మంచిది కాదన్నారు. ప్రస్తుతం పలు చోట్ల వర్షం కురుస్తున్న కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

గాలి, వాన కురిసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- చిన్నపాటి వర్షం కురుస్తున్న సమయంలో సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలి.
- ఉరుములు, మెరుపులు వస్తున్న సమయంలో ఎత్తైన ప్రదేశాలు, చెట్ల కింద ఉండకూడదు.
- పిడుగులు పడే సమయంలో ల్యాండ్ లైన్ ఫోన్ కాని, సెల్‌ఫోన్ ద్వారా కాని మాట్లాడకూడదు.
- ఇంట్లోని స్విచ్ బోర్డుల నుంచి ప్లగ్‌లు తీసివేయాలి.
- టీవీలు చూడకపోవటం మంచిది.
- విద్యుత్ తీగెలు, ట్రాన్స్‌ఫార్మర్‌ల సమీపంలో ప్రజలు ఉండకూడదు.
- ఉరుములు, మెరుపుల సమయంలో మన శరీరం జలదరింపునకు గురవడం. రోమాంచితం కావటం వంటి సంకేతాలు వస్తే సమీపంలో పిడుగు పడబోతున్నట్లు గుర్తించాలి.

డీవీఆర్ కాలనీలో కార్డన్ సెర్చ్



నందిగామ: పట్టణ శివారు డీవీఆర్ కాలనీలో మంగళవారం తెల్లవారుజామున 4 గంటలకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వందమందికి పైగా పోలీసులు ఒకేసారి కాలనీని చుట్టుముట్టి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సుమారు నాలుగు గంటల పాటు ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఏసీపీలు రవికిరణ్, స్రవంతి రాయ్‌ల ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. తెల్లవారుజామున 4 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు కాలనీలోని 467 ఇళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఆ సమయంలో ఎటువంటి పత్రాలు లేకుండా ఉన్న 29 వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. అనుమానంగా ఉన్న 72 మందికి ఐరిష్ నిర్వహించారు. వారిలో ఆరుగురు పాత నేరస్తులు ఉన్నట్లు గుర్తించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ హనీష్‌తో పాటు, డివిజన్ పరిధిలోని అధికారులు, వందమందికి పైగా సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల ఆధ్వర్యంలో స్వచ్ఛత కార్యక్రమం



పల్లగిరి గ్రామంలో రహదారులు శుభ్రం చేస్తున్న విద్యార్థులు

నందిగామ: డాక్టర్ కేఎల్ రావు కృషి విజ్ఞాన కేంద్రం, బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో మండలంలోని పల్లగిరి గ్రామంలో మంగళవారం స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. జాతీయ సేవా పథకంలో భాగంగా బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో గ్రామంలో వారం రోజులపాటు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ క్రమంలో మొదటి రోజు ముందుగా గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు శ్రీనివాసులు, శేషారెడ్డి, కేఎల్ రావు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు కృష్ణంరాజు, వెంకట్ రెడ్డి, రాజశేఖర్, లక్ష్మీకళ గ్రామంలో నిర్వహించనున్న సేవా కార్యక్రమాల గురించి గ్రామస్తులకు వివరించారు. అనంతరం విద్యార్థులు గ్రామాల్లోని పలు ప్రధాన రహదారులను శుభ్రం చేసే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు కూడా పాల్గొన్నారు.

తక్కువ ఎత్తులో విద్యుత్ తీగలతో ఇబ్బందులు



ముత్యాలమ్మ అమ్మవారి వీధిలో తక్కువ ఎత్తులో ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ తీగలు

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలో పలు చోట్ల విద్యుత్ తీగలు తక్కువ ఎత్తులో వేలాడుతుండటంతో ప్రమాదకరంగా పరిణమిస్తున్నాయి. ముఖ్యంగా ప్రధాన వీధుల్లో ఇలా వేలాడుతుండటంతో రోడ్డుపై ప్రయాణం వాహనదారులకు ప్రాణాలతో చెలగాటంలా తయారైంది. పట్టణంలోని ముత్యాలమ్మ అమ్మవారి వీధి, మార్కండేయ బజారు, రజక వీధి, నాగమయ్య బజారు తదితర ప్రాంతాల్లో విద్యుత్ తీగలు, స్తంభాల వద్ద నుంచి వచ్చే సర్వీసు వైర్లు తక్కువ ఎత్తులో ఉన్నాయి. ట్రాక్టర్లు, ఆటోలు, మినీ వ్యాన్‌లు, ఆటో ట్రాలీలు రోడ్డుపై ప్రయాణిస్తుంటే ఎక్కడ విద్యుత్ తీగలు తగులుతాయో, ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ప్రయాణికులు భయాందోళనలకు గురవుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలను గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయా ప్రాంతాల వాసులు కోరుతున్నారు.

అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా చర్యలు



పోలీస్ సిబ్బందికి సూచనలిస్తున్న డీసీపీ

జమ్మవరం(వీరులపాడు): ఎన్నికల ఫలితాల అనంతరం ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని విజయవాడ డీసీపీ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని జమ్మవరం గ్రామాన్ని నందిగామ ఏసీపీ రవికిరణ్‌తో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని, 144 సెక్షన్ అమలులో ఉందని, నిబంధనలను అతిక్రమిస్తే ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ముఖ్యంగా రాజకీయ పార్టీల నాయకులు కవ్వింపు చర్యలకు పాల్పడకుండా శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలని సూచించారు. అనంతరం గ్రామంలో పోలీస్ పికెట్ సిబ్బందికి ఆయన పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో నందిగామ రూరల్ సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ మహాలక్ష్మణుడు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

శుభకరం.. శ్రీలలిత నామజపం



మీనాక్షి దేవికి పూజలు



లలితా సహస్రనామ పారాయణంలో భక్తులు

విజయవాడ కల్చరల్: శ్రీ లలితా నామజపం శుభకరమని ఆధ్యాత్మిక వేత్త పసుమర్తి కామేశ్వరశర్మ అన్నారు. జయహో భారతీయం ఆధ్వర్యాన గాంధీనగర్ శివరామకృష్ణ క్షేత్రంలో మంగళవారం మీనాక్షి దేవికి మల్లెపూల అర్చన, కుబేర కుంకుమార్చన, సామూహిక లలితా సహస్రనామ జపం, శ్రీ చక్రార్చన చేశారు. కామేశ్వరశర్మ మాట్లాడుతూ సర్వశక్తివంతమైనది లలితా నామ పారాయణమన్నారు. సర్వపాపాలు హరిస్తాయన్నారు. ముఖ్య అతిథి యాబలూరి లోకనాథశర్మ ధీటా జయహో భారతీయం ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. శ్రీ చక్రానికి అర్చన చేసిన కుంకుమ ధరిస్తే వ్యాపారం, ధనవృద్ధి, ఆరోగ్యం కలుగుతుందని తెలిపారు. నిర్వాహకులు శ్రీనివాస రెడ్డి అగస్త్య, వల్లీశ్వర్ పాల్గొన్నారు.

భక్తితో లలితా సహస్రనామ పారాయణం

వెంకట్రావ్ శంఖనాదంతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. రుత్వికులు మంగళంపల్లి సాయికుమార శర్మ, చెరువు విశ్వనాథ శర్మ ఆధ్వర్యంలో సర్వాభరణ భూషితురాలైన మీనాక్షి అమ్మవారికి మల్లెపూలు, జాజులు, గులాబీలు, తులసి మారేడు, దవనం, మరువం పూజలు నిర్వహించారు. కుబేర కుంకుమ(ఆకుపచ్చని కుంకుమ) శ్రీ చక్రార్చన నిర్వహించారు. 500 మంది మహిళలు ఐదు సార్లు లలితా సహస్ర నామ పారాయణం చేశారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు



శ్రీదత్తసాయి మందిరంలో శ్రీదత్తసాయి విద్యాసాయం కార్యక్రమం

మధురానగర్(విజయవాడసెంట్రల్): టెన్త్‌లో 95 శాతానికి పైగా మార్కులు సాధించిన నిరుపేద కుటుంబాల విద్యార్థులకు శ్రీదత్తసాయి మందిరం ఆలయ కమిటీ ఆధ్వర్యాన మంగళవారం ప్రోత్సాహకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మందిర వ్యవస్థాపకుడు తంగెళ్లమూడి వీరమోహనరావు మాట్లాడుతూ విద్యతోనే అభివృద్ధి సాధ్యమని తెలిపారు. విద్యాభివృద్ధికి ప్రోత్సాహకాలు పంపిణీ చేయాలని బాబావారు తనకు స్వప్నంలో తెలియజేశారన్నారు. తాను దాతలతో కలిసి శ్రీదత్తసాయి విద్యాసాయం పేరిట 26 మంది నిరుపేద పదో తరగతి ప్రతిభావంతులైన విద్యార్థులు ఒక్కొక్కరికి రూ. 5వేలు చొప్పున రూ.1.30 లక్షలు పంపిణీ చేస్తున్నామన్నారు. ఇక నుంచి ఏటా శ్రీదత్తసాయి విద్యాసాయం పేరిట పేద విద్యార్థులకు ప్రోత్సాహకాలు పంపిణీ చేస్తామని తెలిపారు. తాము సామాజిక బాధ్యతగా ప్రారంభించిన శ్రీదత్తసాయి విద్యాసాయానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం 26 మంది విద్యార్థులతో బాబాకు ప్రత్యేక పూజలు చేయించి బాబావారి శేష వస్త్రం, రూ. 5వేలు చొప్పున నగదుతో సత్కరించారు. కార్యక్రమంలో పలు పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జగనన్న మళ్లీ సీఎం కావాలని ప్రార్థనలు



కొండపల్లి దర్గాలో ప్రార్థన చేస్తున్న సచివాలయ కన్వీనర్లు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ప్రతి పేదవాడు తలెత్తుకుని బతకాలని, నవరత్న పథకాలతో సంక్షేమం అందజేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని కొండపల్లి సచివాలయ కన్వీనర్లు స్థానిక షాబూఖారీ దర్గాలో మంగళవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రజలందరి ఆశీస్సులతో మళ్లీ సీఎంగా వైఎస్ జగన్ ప్రమాణస్వీకారం చేయాలని ఆకాంక్షించారు. అలాగే మైలవరం నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతి రావు ఎమ్మెల్యేగా గెలుపొంది అసెంబ్లీలో అడుగు పెట్టాలని ప్రార్థించారు. సచివాలయ కన్వీనర్లు షేక్ జానీ షరీఫ్, కాలగడ్డ మనోహర్, మొగిలి నాగరాజు, మాడుగుల చందు, పిట్టల మల్లికార్జున రావు, డొక్కమాల పవన్‌కుమార్, కుంచెం ప్రసాద్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

మైలవరం: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని సీడీపీఓ పుష్పలత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ, విజయవాడ ఆధ్వర్యంలో ఐసీడీఎస్ కార్యక్రమాలులో భాగంగా సోషల్ ఇష్యూస్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. దీనిలో భాగంగా మైలవరం, ఇబ్రహీంపట్నం మండల కార్యాలయాల వెలుపలి గోడలపై భారీ పెయింటింగ్‌లు వేయించామని చెప్పారు. ప్రజల్లో బాలికలపై లైంగిక వేధింపులు అరికట్టడానికి, బాల్య వివాహాలు నిరోధించాలని చైతన్యం కల్పిస్తున్నామన్నారు. బాలికలకు సమాన అవకాశాలు, సమాన అధికారాలు, పుట్టబోయే బిడ్డ ఆడా, మగా అని అడగడం, చెప్పడం కూడా చట్ట రీత్యా నేరమని చెప్పారు. నేటి ఆడపిల్ల రేపటి అమ్మ అనే విషయం, చిన్నారుల దత్తత, బాల్య వివాహాలతో వచ్చే ఇబ్బందులను వివరిస్తున్నామని సీడీపీఓ పుష్పలత చెప్పారు.

పచ్చిరొట్ట సాగుతో భూసారం పెంపు

- పశుగ్రాసంగా ప్రయోజనం
- రైతులకు లాభం



పెనుగంచిప్రోలు: రబీ(దాళ్వా)వరి పంట కోతల అనంతరం రైతులు ఆ భూములను ఖాళీగా ఉంచకుండా పచ్చిరొట్ట పైర్లు సాగు చేసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ఆ సాగు పశువులకు పశుగ్రాసంగా కూడా ఉపయోగపడుతుందన్నారు. పశువులు లేని రైతులు తొలకరి దమ్ముల్లో భూమిలో కలియదున్నటంతో భూసారంగా కూడా ఉపయోగ పడుతుందని చెబుతున్నారు. పచ్చిరొట్ట పైర్లుగా మినుము, పిల్లిపెసర, జీలుగలు, జనుము వంటివి రైతులు సాగు చేస్తున్నారు. ఈ పంటలు భూసారం పెరిగేందుకు దోహదపడటమే కాకుండా పశువులకు మేతగానూ ఉపయోగ పడుతాయి. అయితే రైతులు చాలామంది వేసవి సీజన్‌లో అధిక శాతం భూములను ఖాళీగా ఉంచి కాలువలు వదిలిన తరువాత హడావుడిగా నారుమడులు పోసి, 20 రోజుల్లో దమ్ములు చేసి నాట్లు వేస్తున్నారు. రసాయన ఎరువులతోనే పంటలు పండించటానికి ఆసక్తి చూపుతున్నారు. ఇలా చేయటం వలన క్రమేపీ భూసారం తగ్గిపోవటంతో పాటు దిగుబడులు కూడా తగ్గిపోతున్నాయి. రైతులు తమ పొలాల్లో వేసవి సీజన్‌లో పచ్చిరొట్ట పైర్లు పెంచటం ద్వారా భూసారాన్ని పెంచి, పంటలకు సేంద్రియ ఎరువుల వినియోగం ద్వారా అధిక దిగుబడులు సాధించాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

పచ్చిరొట్ట సాగుతో ప్రయోజనాలు

- పచ్చిరొట్టను సాగు చేయటం ద్వారా భూమి గుల్ల బారి నీటిని, పోషకాలను నిల్వ ఉంచుకునే శక్తి పెరుగుతుంది.
- మొక్కల వేర్లకు పోషకాలు, గాలి, నీరు బాగా అందుతుంది.
- పంటకు కావాల్సిన నత్రజని, భాస్వరం, పొటాష్ వంటి పోషకాలతో పాటు ఇతర సూక్ష్మపోషకాలు అందుతాయి.
- నేలలో చౌడు శాతాన్ని తగ్గిస్తుంది. సూక్ష్మపోషకాల లభ్యతను పెంచుతుంది.
- కలుపు మొక్కల ఉధృతిని తగ్గిస్తుంది.
- పంటలో వ్యాధి నిరోధక శక్తిని పెంచుతుంది.
- తద్వారా చీడపీడలు తక్కువగా ఆశిస్తాయి.
- నేల లోపలి పొరల్లోని పోషకాలు పై పొరల్లోకి వచ్చి పంట దిగుబడి శాతం పెరుగుతుంది.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు



పచ్చిరొట్ట సాగు వైపు రైతులు దృష్టి పెట్టాలి. సేంద్రియ ఎరువుల వాడకం కూడా పెంచాలి. తద్వారా నాణ్యమైన అధిక దిగుబడులు వస్తాయి. మండలంలో 26,031 ఎకరాల సాగు కాగా ఈ వేసవిలో పచ్చిరొట్ట సాగు నిమిత్తం అన్ని ఆర్బీకేల్లో పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధంగా ఉంచుతున్నాం. జీలుగులు 250 క్వింటాళ్లు, పిల్లిపెసర 150 క్వింటాళ్లు రెండు రోజుల్లో ఆర్బీకేలకు వస్తాయి. రైతులకు 50 శాతం సబ్సిడీపై అందిస్తాం. ఎకరానికి ఒక బ్యాగ్ చొప్పున 5 ఎకరాల వరకు ఇస్తాం.

–కె రామసుబ్బారెడ్డి ,ఏఓ

సీపీఐ నారాయణ నోటి దురుసు తగ్గించుకోవాలి

వైఎస్సార్ సీపీ ఎస్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుడుముల రామచంద్రయ్య

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సీపీఐ జాతీయ నాయకుడు నారాయణ నోరు అదుపులో పెట్టుకుంటే బాగుంటుందని వైఎస్సార్ సీపీ ఎస్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుడుముల రామచంద్రయ్య హితవు పలికారు. ఎన్నికల సమయంలో జరిగిన అల్లర్లకు అధికార వైఎస్సార్ సీపీనే కారణమంటూ నారాయణ చేసిన వ్యాఖ్యలను ఆయన మంగళవారం ఓ ప్రకటనలో ఖండించారు. కమ్యూనిస్టు పార్టీ అని చెప్పుకునే నారాయణ అగ్రకుల అహంకారంతోనే రాష్ట్రంలో ఎంతో అభివృద్ధి చేసిన వైఎస్సార్ సీపీపై నిరాధార ఆరోపణలు చేశారని మండిపడ్డారు. పేదల కోసం ఆస్తులను పార్టీకి అంకితం చేసిన పుచ్చలపల్లి సుందరయ్య వంటి వారు నిజమైన కమ్యూనిస్టులని, అలాంటి కమ్యూనిస్టు పార్టీలో నేడు పెత్తందారులు చేరి పేదల కోసం పని చేస్తున్న వైఎస్సార్ సీపీపై విమర్శలు చేస్తున్నారన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలు ఈ రాష్ట్రంలో అలజడి సృష్టిస్తుంటే.. నారాయణలాంటి వారు వారికి మద్దతు ప్రకటిస్తున్నారని పేర్కొన్నారు.

మైలవరంలో పోలీసుల కార్డన్ సెర్చ్



మైలవరం: మైలవరం తారకరామానగర్ ఏరియాలో మైలవరం పోలీస్ సబ్ డివిజన్ ఏసీపీ ఎస్. మురళీమోహన్ పర్యవేక్షణలో మంగళవారం ఆపరేషన్ కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మురళీమోహన్ మాట్లాడుతూ.. కమిషనర్ ఆఫ్ పోలీస్ రామకృష్ణ ఆదేశాల మేరకు డెప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ కె.శ్రీనివాసరావు సూచనలతో తనిఖీలు చేపట్టామన్నారు. ఇటీవల ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలో జరిగిన సంఘటనల నేపథ్యంలో ముందస్తు జాగ్రతలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలు కలిగి ఉంటే, వాటిని సీజ్ చేస్తామన్నారు. అనుమానిత వస్తువులు, అనుమానితులు, బయటి వ్యక్తులు ఎవరైనా వస్తే వెంటనే తమకు తెలియజేయాలని ప్రజలకు సూచించారు. కార్డన్ సెర్చ్‌లో సీఐ కిషోర్‌బాబు, సబ్ డివిజన్ పరిధిలోని జి.కొండూరు, రెడ్డిగూడెం, తిరువూరు ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.